## ● రహదారిని కమ్మేసిన పొగ మంచు



మహదేవపూర్ మండలకేంద్రంతో పాటు గ్రామాలను ఆదివారం తెల్లవారుజామున దట్టమైన పొగ మంచు కమ్మేసింది. ఉదయం 6 గంటలు దాటే వరకు మంచు కప్పి ఉండడంతో పలు గ్రామాల్లో ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది.

*- మహదేవపూర్, నవంబర్ 3*





చేతికొచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టడం రైతులకు ఏటా సవాలుగా మారుతున్నది. వానకాలం వరి కోతల సమయంలోనైతే ఈ సమస్య ఎక్కువగా ఉంటున్నది. నిత్యం ఎండబోసుడు, దగ్గర పోయడానికి ఎక్కువ సమయం పడుతున్నది. ఇక రోడ్లపై ఆరబోస్తే ప్రమాదాలు జరిగి, పోలీసు కేసులను ఎదుర్కోవాల్సి వచ్చేది. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేలా ధాన్యాన్ని గంటల వ్యవధిలోనే ఆరబెట్టే మిషన్ ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. ఈ ప్యాడి డ్రయ్యర్ యంత్రంతో రైతులు గంటన్నర సమయంలో 25 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆరబెట్టి నేరుగా మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించుకోవచ్చు.

*- హనుమకొండ సబర్బన్, నవంబర్ 3*

ధాన్యాన్ని ఆరబెట్టే యంత్రం

# ఆరబెట్టుడు ఇక అల్కగ!

## ధాన్యంలో తేమ శాతం తగ్గించేందుకు సరికొత్త డ్రయ్యర్

- గంటన్నర వ్యవధిలో 45 బస్తాలు
- తాలు, దుమ్ము సైతం మాయం
- వడ్ల ఆరబోత కష్టాలకు చెక్
- ఆసక్తి చూపుతున్న రైతులు

ఇటీవల కాలంలో యూట్యూబ్ వ్యవసాయానికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసింది. రైతులు దీని ద్వారా అనేక నూతన వ్యవసాయ పద్ధతులను తెలుసుకొని అవలంబిస్తున్నారు. ఈ క్రమంలోనే హసన్‌పర్తి మండలం సుబ్బయ్యపల్లికి చెందిన రైతు అవిర్నేని వేణు యూట్యూబ్ ద్వారా ధాన్యాన్ని ఆరబెట్టే యంత్రం గురించి తెలుసుకున్నాడు. వెంటనే పంజాబ్ రాష్ట్రానికి వెళ్లి దాన్ని పరిశీలించి రూ.10 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశాడు. దీని ట్యాంకును ఒకసారి నింపితే 45 బస్తాల వరకు(25 క్వింటాళ్లు) గంటన్నర సమయంలో 30 శాతం వరకు ఉన్న తేమ 11 శాతానికి వస్తుంది. 225 సార్స్ పవర్ గల మిషన్ బర్నర్ సహాయంతో 80 డిగ్రీ సెల్సియస్ వేడిని ఉత్పత్తి చేస్తుంది. దీంతో ధాన్యం తొందరగా ఆరిపోయి మనకు కావాల్సిన తేమ శాతంతో బయటకు వస్తుంది. దీన్ని తీసుకొచ్చిన కొత్తలో మిషన్‌లో వడ్లను కూలీలు పోస్తేనే ఆరబెట్టే వీలు ఉండేది. ఈ సమస్యను అధిగమించడానికి వేణు గుజరాత్‌కు వెళ్లి ప్రత్యేకంగా స్క్రూ కన్వేయర్ అనే పరికరాన్ని తీసుకొచ్చి దీనికి అమర్చాడు. దీంతో కుప్ప పోసి ఉన్న వడ్లను అదే లోపలికి లాక్కొని ట్యాంకులోకి పంపుతుంది.

**వడ్ల నాణ్యత రెట్టింపు**

మిషన్‌లో వడ్లను పోసిన తర్వాత ప్రతి గింజ నాలుగు సార్లు ట్యాంకులో రొటేట్ అవుతుంది. దీంతో ట్యాంకు నుంచి తాలు వడ్లు ఒకవైపు నుంచి, దుమ్ము ధూళి మరోవైపు నుంచి బయటకు వెళ్లిపోతాయి. దీంతో గింజలు షైనింగ్‌తో కనబడతాయి. సహజ పద్ధతిలో ఆరబెట్టకుండా ఈ మిషన్ ద్వారా ఆరబెడితే జర్మినేషన్ సమస్య వస్తుందనే సందేహాలు నెలకొన్న నేపథ్యంలో పలు కంపెనీల ప్రతినిధులు దీని ద్వారా ఎండ బెట్టిన గింజలను పరీక్షించగా మొలకలు కూడా బాగానే వచ్చాయి. దీంతో రైతులు ఈ మిషన్‌పై ఆసక్తి చూపుతున్నారు. ఈ ప్యాడి డ్రయ్యర్‌తో 24 గంటల పాటు పని చేసుకునే వీలుంటుంది. 25 క్వింటాళ్ల వడ్లు ఎండబెట్టేందుకు రూ.2800 వరకు చార్జ్ చేస్తున్నారు.

### రైతులు ఇప్పడే అలవాటు పడుతున్నారు



కోతల సీజన్‌లో వడ్లను ఆరబెట్టేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. నేను కూడా ఆ కష్టాలు అనుభవించాను. అనుకోకుండా యూట్యూబ్‌లో ప్యాడి డ్రయ్యర్ చూశాను. దీని కోసం పంజాబ్ రాష్ట్రానికి వెళ్లి డెమో చూసి కొన్నా. రైతులు ఇప్పుడిప్పుడే అలవాటు అవుతున్నారు. దీని వల్ల కూలీల ఖర్చుతగ్గడంతో పాటు తొందరగా ధాన్యం అమ్ముకునే వీలుంటుంది.

– అవిర్నేని వేణు, డ్రయ్యర్ యజమాని

- మంత్రి, కలెక్టర్ల ఆదేశాలూ పట్టించుకోని వైద్యాధికారులు
- సామాన్యులకు అందని ద్రాక్షగా సర్కారు వైద్యం

# ఎంజీఎంలో తీరుమారేదెన్నడు?

## నిబంధనలు పాటించని వైద్యులు, ఇబ్బంది పడుతున్న రోగులు

వరంగల్ చౌరస్తా, నవంబర్ 3 : పేదల సంజీవనిగా పేరొందిన ఎంజీఎం దవాఖాన, కాకతీయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్య సేవలు అందని ద్రాక్షలా మారాయి. ఉచిత వైద్యమని ఇక్కడికి వస్తే కొందరు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు నిలిచే పరిస్థితి కనిపించడం లేదు. హాస్పిటల్‌లో వైద్యసేవలు పూర్తిగా వైద్య విద్యార్థులే అందిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో ఎంజీఎం, కేఎంసీలో విధులు నిర్వర్తిస్తున్న సుమారు 30 మంది ప్రొఫెసర్లు బదిలీపై వెళ్లగా, వారిలో సగంమంది కూడా భర్తీ కాకపోవడంతో విద్య, వైద్య సేవలు వెనకబడ్డాయి. మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు నిర్వహించిన సమీక్షలు ఊకదంపుడు ముచ్చట్లుగానే మిగిలిపోయాయి. జనరల్ మెడిసిన్, సైక్రియాట్రిక్, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, నెఫ్రాలజీ విభాగాలతోపాటుగా చాలా విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు స్థానికంగా ఉంటూ విధులు నిర్వర్తించాల్సి ఉన్నా అవేమీ పట్టించుకోవడం లేదు. విద్యార్థులు, రోగుల పరిస్థితిని వివరిస్తూ, పాఠాలు బోధించాల్సిన ప్రొఫెసర్లు విధులకు ఆలస్యంగా హాజరు కావడం, కొన్ని సందర్భాల్లో డుమ్మా కొట్టడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, స్థానిక జిల్లా మంత్రివర్యులు కొండా సురేఖ ఎంజీఎంను సందర్శించిన సమయంలో ప్రజావైద్య సేవలు మెరుగు పరచడం కోసం సత్వర చర్యలు తీసుకోవడంతోపాటుగా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించినప్పటికీ పలువురు ప్రొఫెసర్లు, వైద్యాధికారులు తమ పద్ధతిని మార్చుకోకపోవడంతో రోగులకు కష్టాలు తప్పడం లేదు.

**కలెక్టర్ ఆగ్రహించినా మారని తీరు**

పేదలకు గవర్నమెంట్ ఉచిత వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఎంజీఎం సందర్శించిన ప్రతిసారి కలెక్టర్ వైద్యాధికారులను హెచ్చరిస్తున్నా అధికారులు, వైద్యుల తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు. వైద్యుల హాజరు పట్టిక నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తుండడంతో విధుల హాజరు, సమయపాలన విషయంలో ఉద్యోగులు, వైద్యులు పట్టింపు కరువయ్యింది. దాంతో పేదల వైద్యసేవలు నీరుగారిపోతున్నాయి. కలెక్టర్ ఆదేశాలతో ఇటీవల ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెల్లో సైతం చాలా వరకు వైద్యుల గైర్హాజరుపైనే ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఇటీవల పరిపాలనా విభాగం, పారా మెడికల్, స్టాఫ్ నర్సుల హాజరు నమోదు బయోమెట్రిక్ యంత్రం మాయం వెనక కొందరు ఉద్యోగుల హస్తం ఉన్నట్లు ఎంజీఎం సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు.

## రామప్పలో సండే సందడి


బొగత జలపాతం వద్ద పర్యాటకులు

వెంకటాపూర్/వాజేడు, నవంబర్ 3 : రామప్ప దేవాలయం ఆదివారం భక్తులు, పర్యాటకులతో సందడిగా మారింది. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, రాజస్థాన్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి పర్యాటకులు, విదేశీయులు, పలువురు అధికారులు, రాజకీయ నాయకులు సందర్శించారు. ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ విశేషాలను టూరిజం గైడ్స్ ద్వారా తెలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. శిల్పాలను ఫొటోలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. మామిడి, మారేడు చెట్ల కింద మహిళలు దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలను చాటారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేస్తూ ఆహ్లాదంగా గడిపారు. బొగత జలపాతం వద్దకు ఆదివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. జలపాతం వ్యూ పాయింట్ నుంచి కెమెరాలు, సెల్ ఫోన్లలో ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. స్విమ్మింగ్ పూల్‌లో స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు.

## వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేస్తాం

- ఎయిర్‌పోర్టుకు అడ్డంకులు తొలిగాయి
- భద్రకాళీ చెరువు కబ్జా చేసిన వారిపై చర్యలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


భద్రకాళీ మాడవీధుల నిర్మాణంపై మంత్రి పొంగులేటికి వివరిస్తున్న అధికారులు

వరంగల్, నవంబర్ 3 : చారిత్రక వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన వరంగల్ నగరంలోని భద్రకాళీ బండ్ సుందరీకణ, మాడవీధుల అభివృద్ధి, బొందివాగు వరద నివారణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ.. మరో మూడు దశాబ్దాలను దృష్టిలో ఉంచుకొని వరంగల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. వరద నివారణకు రూ.158 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 380 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భద్రకాళీ చెరువులో పూడిక పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం తగ్గిందని, వెంటనే పూడికతీత పనులకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళీ చెరువును కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే చేసి అక్రమ నిర్మాణాలను తొలగిస్తామన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు అన్ని అడ్డంకులు తొలగిపోయాయని, కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే వెంటనే నిర్మాణం చేపడుతామని పేర్కొన్నారు. త్వరలోనే కాళోజీ కళాక్షేత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, కుడా పీవో అజిత్‌రెడ్డి, బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు బీమ్‌రావు, సంతోష్‌బాబు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల పరిశీలన

- తేమ శాతం రాగానే ధాన్యం కొంటాం : డీఆర్డీవో, డీటీ


ఎల్కతుర్తి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో నాగపద్మజ

నమస్తే ఎఫెక్ట్

హనుమకొండ సబర్బన్/పాలకుర్తి, నవంబర్ 3 : ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాకపోవడంతో 'నమస్తే తెలంగాణ'లో ఆదివారం ప్రచురితమైన 'ఎక్కడి వడ్లు అక్కడే' అన్న కథనానికి అధికారులు స్పందించారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కాంటాలు వేయని దుస్థితి కేంద్రాల్లో నెలకొంది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో నాగపద్మజ సందర్శించారు. రైతులతో మాట్లాడి ధాన్యం తేమ శాతం లేకుండా తేవాలని చెప్పారు. కేంద్రాల్లో అన్ని వసతులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కాగా, ధాన్యం ఎప్పటి నుంచి కొనుగోలు చేస్తారో అధికారులు చెప్పకపోవడంతో రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా జనగామ జిల్లా పాలకుర్తి మండలం మల్లంపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీటీ దేవానాయక్ మాట్లాడుతూ తేమ శాతం రాగానే కాంటాలు చేపడతామన్నారు. రైతులు ధాన్యం పోసి పది రోజులు గడుస్తున్నా అధికారులు ఈ రోజు వచ్చి తేమ శాతం రాలేదని చెప్పడం గమనార్హం. కార్యక్రమంలో డీపీఎం ప్రకాశ్, ఏపీఎం రవీందర్, ఏఈవో పున్నంచందర్, సీసీ రవీందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రతీకార పాలన

- ఆటో కార్మికులకు అండగా నిలవాలి
- ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తున్న సర్కారు
- 5న జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, నవంబర్ 3 : కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు.. ప్రతీకార పాలన అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. ఆదివారం వడ్డేపల్లిలోని ఆయన నివాసంలో ఆటో కార్మిక నాయకులతో కలిసి మాట్లాడారు. పూర్తి స్థాయిలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించలేని దుస్థితిలో ఉన్నారని, అలాగే రోడ్డున పడ్డ ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపించకపోవడంతో ఇప్పటికే కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేయలేక అసహనంతో ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతున్న బీఆర్ఎస్ పార్టీ, నాయకులపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిరంతరం బీఆర్ఎస్ పోరాడుతోందని స్పష్టం చేశారు. 300 రోజుల కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క వర్గ ప్రజలు సంతోషంగా లేరని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 10లక్షల మంది అసంఘటిత ఆటో కార్మికుల జీవితాలు, వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ మొండి వైఖరి నేపథ్యంలో తమ డిమాండ్ల సాధనకు పార్టీలకు అతీతంగా ఆటో కార్మికులంతా జేఏసీగా ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. ఈ నెల 5న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం ఆటో కార్మిక సంఘం నాయకులు ఇసంపల్లి సంజీవ్, మడికొండ బాబు మాట్లాడుతూ.. ఉచిత బస్సు స్కీంతో ఆటో కార్మికులంతా రోడ్డున పడాల్సి వచ్చిందన్నారు. రోజు కనీసం రూ.200 సంపాదించలేకపోతున్నామన్నారు. ఆటో ఫైనాన్స్, పిల్లల ఫీజులు కట్టలేక, కుటుంబాన్ని వెళ్లదీయలేక ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 57 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. అవి ఆటో కార్మికుల ఆత్మహత్యలు కావని, ప్రభుత్వం చేసిన హత్యలేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ఆటో యూనియన్ నాయకులు రవీందర్ రెడ్డి, జయరాం, రవి, రాంచందర్, నర్సింగ్, నరహరి, రమేశ్, వెంకటస్వామి, సాయిలు, పరశురాములు పాల్గొన్నారు.

## ఉద్యోగాలకు ఎంపికైనా పోస్టింగేది?

- ఎన్పీడీసీఎల్‌లో జేఏ, ఆపరేటర్ అభ్యర్థుల ఆందోళన
- పరీక్షలు రాసి 16 నెలలుగా ఎదురుచూపులు
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయినా అపాయింట్‌మెంట్ ఆర్డర్‌లో జాప్యం
- అభ్యర్థులపై కాంగ్రెస్ సర్కారు చిన్నచూపు



వరంగల్, నవంబర్ 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి): నిరుద్యోగులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుకుంటున్నది. పరీక్షలు రాసి రిజల్ట్ వచ్చి ఎంపికైనా ఉద్యోగాలు ఇవ్వడంలేదు. అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఎప్పుడు ఇస్తారో తెలియక నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్(టీజీఎన్పీడీసీఎల్)లో జూనియర్ అసిస్టెంట్/ఆపరేటర్ పోస్టులకు ఎంపికైన వారి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరు నిరుద్యోగులకు ఇబ్బందికరంగా మారింది. జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో టీజీఎన్పీడీసీఎల్ సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లను ఏర్పాటు చేసింది. కొత్త వ్యవస్థకు అనుగుణంగా టీజీఎన్‌పీడీసీఎల్ పోస్టుల భర్తీ ప్రక్రియను మొదలుపెట్టింది. టీజీఎన్పీడీసీఎల్‌లో 100 జూనియర్ అసిస్టెంట్/కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీ కోసం 2023 మార్చి 31న నోటిఫికేషన్ జారీ అయ్యింది. జూన్ 4న అప్పటి ప్రభుత్వం హైదరాబాద్‌లో రాతపరీక్ష నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా రిజల్ట్ విడుదల కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పోస్టుల భర్తీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. రాత పరీక్ష జరిగిన 14 నెలలకు ఫలితాలు విడుదల చేసింది. అర్హుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసి రెండు నెలలు అవుతున్నా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడం లేదు. దీంతో ఎంపికైన అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు.

## దేవాదుల పైపులైన్ ఎయిర్‌వాల్వ్ లీకేజీ

- వంద అడుగుల ఎత్తులో ఎగిసిపడిన గోదావరి జలాలు
- కోతకు వచ్చిన 50 ఎకరాల వరి పంటకు నష్టం


శాయంపేట : భారీ ఎత్తున ఎగిసిపడుతున్న గోదావరి జలాలు

శాయంపేట, నవంబర్ 3 : మండలంలోని పెద్దకోడెపాక శివారులో దేవాదుల పైపులైన్ ఎయిర్‌వాల్వ్ లీకేజీ అయింది. సుమారు వంద అడుగుల ఎత్తుకు నీళ్లు ఎగిసిపడి ఫౌంటెన్‌ను తలపించింది. చుట్టున్న పంట పొలాల్లోకి నీళ్లు భారీగా చేరాయి. చలివాగు రిజర్వాయర్ నుంచి 46 కిలోమీటర్ల దూరంలోని ధర్మసాగర్‌కు గోదావరి జలాలను మోటర్లతో పైపులైన్ ద్వారా పంపింగ్ చేస్తున్నారు. చలివాగు పంప్‌హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌పై శనివారం రాత్రి కోతి పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు తెలిసింది. ఈ క్రమంలో నీటి పంపింగ్‌లో ఒత్తిడి జరిగి శనివారం అర్ధరాత్రి దాటాక పెద్దకోడెపాక బ్రాహ్మణకుంట పరిధిలో దేవాదుల పైపులైన్ ఎయిర్‌వాల్వ్ లీకేజీ ఏర్పడినట్లు చెబుతున్నారు. పెద్ద శబ్దంతో వంద అడుగులపైకి నీళ్లు ఎగజిమ్మాయి. లీకేజీతో పెద్ద ఎత్తున ఎగిసిన నీళ్లు పైనున్న 220 హైటెన్షన్ విద్యుత్ వైర్లను తగలడంతో రైతులు భయంతో వణికిపోయారు. ఆదివారం మధ్యాహ్నం దేవాదుల ఇంజినీరింగ్ అధికారులు చలివాగు పంప్‌హౌస్‌లో మోటర్లను బంద్ చేశారు. అప్పటికే గంటల పాటు నీళ్లు ఎగిసిపడి చుట్టున్న పొలాలకు చేరాయి. చేతికొచ్చిన యాభై ఎకరాల వరి పంటలో నీళ్లు నిలిచాయి. దీంతో సుమారు ఇరవై మంది రైతులు తమ పరిస్థితి ఏంటని వాపోయారు. పంపింగ్ బంద్ చేసినప్పటికీ రాత్రి వరకు పైపులైన్ లీకేజీ కొనసాగినట్లు రైతులు చెప్పారు.


బతుకమ్మ ఆడుతున్న నేతకాని కులస్తులు

## ఘనంగా నేతకాని బతుకమ్మ వేడుకలు

హసన్‌పర్తి, నవంబర్ 3 : సీతంపేటలో మూడు రోజులుగా నిర్వహించిన నేతకాని బతుకమ్మ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు తీరొక్కపూలు తెచ్చి బతుకమ్మలను పేర్చి కోలాటాల నడుమ ఊరేగింపుగా ఊరు చివరనున్న చెరువు కట్ట వద్దకు వెళ్లి బతుకమ్మ ఆడారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేశారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై బతుకమ్మను ఎత్తుకొని నేతకాని కులస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. నేతకాని కులస్తులు జాడి రాజీవ్‌గాంధీ, ఉప్పలయ్య, కనుకయ్య, మాజీ సర్పంచ్ జనగాం శరత్, మాజీ ఎంపీటీసీ రజిత, మాజీ వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.